
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# రోల్ రివర్సల్

" ఏమిటిది తులసీ? ఈరోజు ఇంత లేట్? టిఫిన్ కూడా అవలేదు మాది, ఇంక బయలుదేరదాం అనుకుంటున్నాం ఇప్పుడే. ఇలా అయితే ఎలా?" కోపంగా అంది శ్వేత.

" నాన్నకి ఒంట్లో బాగోలేదక్కా, పొద్దున్నే కళ్ళు తిరిగి పడిపోయాడు ఎందుకనో. డాక్టర్ దగ్గరకి తీకెళ్ళి వచ్చేసరికి లేట్ అయిపోయిందక్కా.. ఒక్క పది నిమిషాలు ఉండండి. ఏదో ఒకటి చేసిపెట్టేస్తాను" అంది తులసి బుట్టలోంచి ఉల్లిపాయలు తీస్తూ..

" వద్దులే తులసీ! లేట్ అయితే బావుండదు. ఇదీ విషయం అని, ఒక్క ఫోన్ చేస్తే సరిపోయేది కదా, మేమే ఏదో ఒకటి చేసుకునేవాళ్ళం! " అంది వసంత.

" నా ఫోన్ లో కరెన్సీ అయిపోయిందక్కా, చూసుకోలేదు. మిస్సెడ్ కాల్ ఇవ్వాలన్న ఆలోచన రాలేదక్కా" అంది క్షమాపణ చెప్తున్నట్టు.

" సరేలే పరవాలేదు. మధ్యాహ్నం మాత్రం త్వరగా వచ్చి పని చేసి వెళ్ళు" అంది వసంత.

" అలాగే అక్కా, సారీ అక్కా " అంటూ పనిలో పడింది.

"సారీ అంటే అయిపోతుందా, రెస్పాన్సిబిలిటీ ఉండద్దా"? అంటూ చిరాకు పడింది శ్వేత.

శ్వేత, వసంత ఇద్దరూ సహోద్యోగులు. కాలేజీ రోజులనించీ స్నేహితులు కూడా. ఇద్దరూ చదువు పూర్తవుతూనే ఒకే కంపెనీలో ఉద్యోగంలో చేరారు. రెండు బెడ్ రూముల ఫ్లాట్ అద్దెకి తీసుకుని ఆఫీసుకు దగ్గరలోనే ఉంటారు. వారిద్దరికీ కావలసిన ఇంటిపనీ, వంట పనీ అంతా చెయ్యడానికే తులసిని పెట్టుకున్నారు.. తులసి చాలా చురుకైనది, పని బాగా చెయ్యడం ఒక్కటే కాదు, ఇల్లంతా తన మీద వదిలి వెళ్ళినా సరే ఎంతో నమ్మకంగా పనులన్నీ చేసి వెళ్తుంది. అందుకనే ఆమె పనిచేసే ఇళ్ళవాళ్ళల్లో ఉద్యోగినులు తాళాలు ఆమె చేతికే ఇస్తారు. అవన్నీ ఒక పర్స్ లో వేసుకుని వస్తుంది రోజూ. తులసీ, ఆమె తండ్రీ మాత్రమే ఉంటారు ఇక్కడ. అతనికి ఆరోగ్యం బాగోలేకపోతే వైద్యం కోసమే సిటీకి వచ్చామని, తన అక్కా, బావా వాళ్ళంతా ఊర్లోనే ఉంటారనీ చెప్పింది తులసి. తగ్గిపోతే వెనక్కి వెళ్ళిపోతామని కూడా అంటూ ఉంటుంది.

"ఒక్కసారి సిటీ లైఫ్ కి అలవాటు పడితే వెనక్కి వెళ్ళరు ఎవరూ" అంటుంది శ్వేత.

పొద్దున్నే వచ్చి స్నేహితురాళ్ళిద్దరికీ టిఫిన్ చేసి కొంత పని చేసుకుని వెళ్తుంది తులసి. తర్వాత మళ్ళీ సాయంత్రం వచ్చి ఇల్లంతా శుభ్రం చేసి, బట్టలు మడతపెట్టి, రాత్రికి వంట చేసి అన్నీ టేబిల్ మీద సిద్ధంగా ఉంచి వెళుతుంది. ఎంతో హాయిగా, కులాసాగా జరుగుతున్న ఏర్పాటు అది.

శ్వేతకి ముక్కు మీద కోపం, మనసు మంచిదైనా, మాట దురుసు కొద్దిగా ఎక్కువే. వసంత స్వభావం పూర్తిగా వేరు. ఆచి తూచి మాట్లాడుతుంది, ఎలాంటి పరిస్థితిలోనైనా శాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తుంది. 'విభిన్న ధృవాలు ఆకర్షించినట్టనిపిస్తుంది మిమ్మల్నిద్దరినీ చూస్తే' అంటారు అంతా వారిద్దరినీ చూసి. ప్రతీ విషయంలోనూ భిన్నాభిప్రాయాలున్న వారిద్దరికీ స్నేహం కలవడమే చిత్రం అనుకుంటే, అది ఇంత గాఢంగా మారడం మరీ విచిత్రం.

మర్నాడు కూడా తులసి కొద్దిగా ఆలస్యంగా వచ్చింది. శ్వేత మళ్ళీ చిరాకు పడింది. ఆఫీస్ కి వెళ్తూ ఉంటే కూడా గొణుగుతూనే ఉంది. వసంత తనని కానట్టు పేపర్ లో సుడోకు చేసుకుంటూ కూర్చుంది.

"నీలా నేనెందుకు ఉండలేనే?" అంది శ్వేత. తనేం చెప్పినా పట్టించుకోకుండా తన మానాన తను పేపర్ చదువుకుంటున్న స్నేహితురాల్ని చూసి చిరుకోపంతో.

నవ్వింది వసంత. " ఒకరితో ఒకరు ఉండగలం గానీ ఒకరిలా ఒకరం ఎలా ఉంటాం?" అంటూ.. టిఫిన్ తిని, మళ్ళీ డెస్క్ దగ్గరకి వచ్చేవరకూ చిటపటలాడుతూనే ఉంది శ్వేత.

మరో అరగంటలో టీం మీటింగ్ ఉండడంతో గబ గబా పనిలో పడ్డారు ఇద్దరూ.

" లీవ్ ఈజ్ నాటే ఏ ప్రివిలేజ్.. జాగ్రత్తగా వాడుకోవాల్సిన బాధ్యత మాత్రమే" అన్నాడు శ్రీకర్ తన టీమునుద్దేశించి మాట్లా డుతూ అన్నాడు. అప్పటివరకూ ప్రాజెక్ట్ కి సంబంధించిన విషయాలు మాట్లాడి, వివిధ విభాగాలు ఎలా పనిచేస్తున్నాయో, ఎంతవరకూ వచ్చారో, ఏమేం ఇబ్బందులున్నాయో అన్నీ వివరంగా కనుక్కున్నాడు. అది ఒక ప్రముఖ కార్ కంపెనీ ఆఫీస్. కొత్త మోడల్ కార్ ని రూపొందించడంలో ఉన్నారు వాళ్ళందరూ.

" చెప్పావా? ఎప్పుడూ అదే మాట అంటాడేవిటే వీడూ, వీడి చాదస్తమూ, లీవ్ ఏదో వీడి జేబులోంచి ఇస్తున్నట్టు" అని విసుక్కుంది శ్వేత.

" ఉష్! ఎవరైనా వింటే బావుండదు. నిజమే కదా! అతను చెప్పేది. బాగా అవసరం అయితే తప్ప సెలవు పెట్టద్దు, దాన్ని హక్కుగా కాక, బాధ్యతగా వాడుకోమంటున్నారు అంతేకదా," అంది వసంత.

" నీకు నోరిప్పడానికే భయం, జీతం సరిగా పెంచడేమో అని" అంటూ నవ్వింది శ్వేత.

ఆమె నవ్వు కొద్దిగా గట్టిగా వినబడేసరికి శ్రీకర్ " ఎస్ శ్వేతా! ఎనీ థింగ్ ఇంపార్టెంట్ ?" అన్నాడు.

" నథింగ్ శ్రీకర్! . అవసరం లేకుండాఎవరూ సెలవు పెట్టరు కదా, అదే మాట మీరు నొక్కి చెప్తే కొంచం నవ్వొచ్చింది. " అంది ఏమాత్రం తొణుకోకుండా..

" వెల్, అదే నిజమని అనుకుందాం, ఒకవేళ ఐతే గొడవే లేదు కదా, అలా కాని విషయాలగురించే నేను చెప్పేది, దానికంటే ఎక్కువ వివరాల్లోకి వెళ్ళక్కర్లేదు ఇప్పుడు. నేను దేని గురించి మాట్లాడుతున్నానో మనందరికీ తెలుసు అన్నాడు సూటిగా. లీవ్ అనేది హక్కు కాదు, బాధ్యత అని గుర్తుంచుకుంటే చాలు. అవసరమైనప్పుడు శలవు ఇవ్వడానికి ఎవరూ అభ్యంతరం చెప్పరు, గుడ్ డే మీ అందరికీ. "అంటూ లేచాడు అతను.

కొత్త మోడల్ కారుని మార్కెట్ లోకి తొందరలోనే ప్రవేశపెట్టాలి. అన్ని పనులూ ఆఘమేఘాల మీద ఎంతో ప్రణాళికా బద్ధంగా జరగాలి. శలవు ఉంది కదా అని చీటికీ మాటికీ పెట్టేసేవాళ్ళని కొంచం అదుపులో ఉంచడానికనే అతను అలా మాట్లాడవలసి వచ్చింది.

చీటికీ మాటికీ సెలవు పెట్టడం శ్వేతకేమీ కొత్త కాదు. ఏదో అవసరం ఉందంటూ తరచూ పర్మిషన్ లు కూడా అడుగుతూ ఉంటుంది. అందుకే పరోక్షంగా తననే హెచ్చరించాడేమో అని ఆమె భావించింది.

స్వతహాగా శ్వేత చాలా తెలివైనది, చెప్పిన పని ఎంతో ప్రతిభావంతంగా చేస్తుంది. అందుకని ఆమెని అందరూ ఇష్టపడతారు కానీ తన స్వభావాన్ని మార్చుకుంటే బావుంటుందని కూడా సూచిస్తూ ఉంటారు.

" నేనేదైనా ముఖం మీదే చెతాను ఫ్రాంక్ గా" అనడం కరక్ట్ కాదు శ్వేత. మనం చెప్పేది అవతలివాళ్ళకి బాధ కలిగించకుండా చెప్పడం కూడా ఎంతో ముఖ్యం" అని చెప్తూ ఉంటాడు శ్రీకర్.

ఆమె ఎవరి సలహాలూ పట్టించుకోదు, తన వ్యవహారాన్ని మార్చుకోదు. పని బాగా చెయ్యకపోయే మాటైతే ఈపాటికి ఆమె ఈ ఉద్యోగంలో ఉంటుందా అనేది అనుమానమే. వసంత ఎన్నోసార్లు చెప్తూ ఉంటుంది. అయినా శ్వేతలో మార్పు వచ్చింది చాలా తక్కువగానే అని చెప్పాలి.

మీటింగ్ పూర్తవగానే అందరూ లేచి నిలబడ్డారు.

"శ్వేతా ఒక్క నిమిషం" అన్నాడు శ్రీకర్.

" యా, శ్రీకర్" అంది విషయం ఏమిటి అన్నట్టు.

" నేను చెప్పిన లీవ్ విషయం టీములో ఏ ఒక్కరినీ ఉద్దేశించి అనలేదు కానీ మీకొక విషయం చెప్పాలి. ప్రాజెక్ట్ ఇప్పుడు చాలా కీలకమైన దశలో ఉంది. మీరు సాధ్యమైనంత తక్కువ గా లీవులు పెడితే మంచిది. మీ బాధ్యత ఈ ప్రాజెక్ట్ లో చాలా ముఖ్యమైనది అని మీకు కూడా తెలుసు. మీలాంటివారు తెలివితేటలకి తోడు ఇంకొంచం రెస్పాన్సిబిల్ గా వ్యవహరిస్తే బావుంటుంది. ఇలా చెప్పానని ఏమీ అనుకోవద్దు, ఇలా చెప్పడం నాకూ ఇష్టం ఉండదు. కానీ టీములో కొందరికి చెప్పక తప్పడం లేదు, మీరొక్కరే కాదు. అర్థం చేసుకుంటారనుకుంటాను" అన్నాడు ఎంతో మృదువుగానే..

"అవసరం అయితే కొద్దిగా ముందు చెప్తే నేను ప్లాన్ చేసుకోవడానికి వీలుగా ఉంటుంది. అప్పటికప్పుడు చెప్తే కష్టం కదా, మీ లీవులే కాదు, జీతాలు కూడా నేను నా జేబులోంచి ఇవ్వడం లేదనుకోండి. అయినా సరే" అంటూ నవ్వాడు.

మెత్తగా చెప్పుతో కొట్టి చెప్పినట్టు భావించింది శ్వేత. అతని ఎదురుగా ఏమీ మాట్లాడలేదు, కానీ పట్టరాని కోపంతో బయటకి వచ్చింది మీటింగ్ నించీ. ఆమె వాలకాన్ని చూసి ఏదో జరిగిందని గ్రహించింది వసంత.

టీకి వెళ్ళినప్పుడు ఆపుకోలేక తన కోపమంతా బయటపెట్టింది శ్వేత. అతనలా డైరెక్ట్ గా చెప్పడం ఆమెకి అస్సలు నచ్చలేదు.

" ఏమనుకుంటున్నాడు అతను? నా సెలవు నా ఇష్టం.. నా వల్ల పని ఆగిందా? లేనప్పుడు అలా ఎందుకు మాట్లాడాలి? డిసిప్లిన్ అంటాడా. చూస్తాను, నాకు తిక్క పుడితే రిజైన్ చేసేస్తాను. ఇదొక్కటే కంపెనీయా? ఇక్కడ కాకపోతే మరో దగ్గర, నాకేం ఉద్యోగం దొరకదా!" అంది కోపంగా, విసురుగా..

" దొరకదని కాదు శ్వేతా, మన యాటిట్యూడ్ కూడా ముఖ్యమే అని చెప్పడం అంతే! రిలాక్స్. నువ్వెంతో తెలివికలదానివి. నీ పనితీరు, సమస్యలని పరిష్కరించే తీరూ అందరికీ ఎంతో నచ్చుతుంది. చాలా మంది నిన్ను నీ ప్రతిభ చూసి ఎంతో అభిమానిస్తారు. జూనియర్లు నిన్ను చూసి పని నేర్చుకుంటారు. అలాంటప్పుడు ఇలాంటి చిన్న విషయాలు ఇబ్బంది పెటకూడదని అలా అని ఉంటారు లేకపోతే శ్రీకర్ అలా మాట్లాడతారా? నువ్వంటే ఆయనకెంతో ఇష్టం కదా " అంది వసంత.

"చూద్దాం" అంటూనే అంతలో ఏదో గుర్తొచ్చినట్టు "ఈ రోజు శుక్రవారం, మర్చిపోకు.. రాత్రి టీ.వీలో మంచి సినిమా ఉంది. మనం చూస్తున్నాం" అంది

" అదిగో మళ్ళీ! ఉండవే బాబూ, నువ్వూ, నీ సినిమా గోలా. చచ్చేంత పని ఉంది అవతల నాకు" అంది వసంత. అనుకున్నట్టే ఆరోజు లేట్ అయింది వాళ్ళిద్దరికీ ఆఫీస్ వదిలేసరికి. నీరసంగా ఇంటికి చేరారు.

ఫ్లాట్ తాళం తీస్తూనే బాంబ్ పడినట్టుగా కేక పెట్టింది శ్వేత.

"ఓ గాడ్, తులసి మళ్ళీ రాలేదు ఈరోజు? నో వండర్, ఎక్కడి పని అక్కడే ఉంది. పొద్దున్నే కదా చెప్పాము. ఈ మధ్యన బాగా ఎక్కువయింది, ఇంతకుముందులా పని చెయ్యడంలేదు సరి కదా, అస్తమానూ సెలవులు పెడుతోంది. ఇప్పుడు చూడు రాత్రికి భోజనం రెడీ చెయ్యలేదు, బట్టలు, గిన్నెలూ అన్నీ అలాగే ఉన్నాయి" అంది పట్టరాని కోపంతో.

శ్వేత కోపం తెలిసిన వసంత తను ఏమాత్రం హడావిడి పడకుండా " ఏదో అర్జంట్ పని వచ్చిందేమో? లేకపోతే ఇలా చెయ్యదు కదా! " అంది వసంత.

" నువ్వలాగే అంటావు. ఈ మధ్యనే రీచార్జ్ చేసింది కదా, ఈ మధ్యన ఎప్పుడైనా మానేస్తే ముందే చెప్పకుండా ఆరోజు పొద్దున్నే ఫోన్ చేసి చెప్తోంది కదా స్టైల్ గా..ఈ రోజు అదీ లేదు. నిన్ననేగా పొద్దున్న లేట్ గా వచ్చింది అని అరిచాను, ఈరోజు సాయంత్రం నీకేమైనా ఫోన్ చేసిందా? నాకేమీ చెప్పలేదు" అంది విసురుగా.

" లేదు, మామూలుగా ఫోన్ చేస్తుంది కదా, చెయ్యలేదంటే ఏదో ఉండి ఉండాలి. అయినా ఇప్పుడవన్నీ ఆలోచిస్తూ కూర్చుంటే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. రేపు శనివారమే కదా! రేపు అడుగుదాంలే, పద ముందు పని సంగతి చూద్దాం" అంది వసంత.

" అబ్బే, నా వల్ల కాదు. మంచిదానివి కదా వసూ, ఈ రాత్రికి ఏదైనా ఆర్డర్ చేసెయ్యి. ఓ అరగంటలో వస్తాడు. ఈలోపల స్నానం చేసి ఫ్రెష్ అవుదాం, తినేసి, రాత్రి టీ.వీ లో సినిమా చూసి పడుకుందాం. అంతకు మించి నావల్ల కాదు" అంది శ్వేత బద్ధకంగా.

" అయినా కొద్దిగా కూడా బాధ్యత లేకుండా ఇలా ఎలా చేసింది అసలు. టీ లేదు, సాయంత్రం తిఫిన్ లేదు, రాత్రికి భోజనం లేదు. ఇప్పుడెలా?" అంది ధుమ ధుమ లాడుతూ.

పొద్దున్నే తిన్న టిఫిన్ ప్లేట్ లూ, తుడవని వంట గట్టూ, సర్దని పక్కలూ.. వీటన్నింటినీ చూస్తూ ఉంటే వసంత కీ చిరాగ్గానే ఉంది. అలా వదిలేయలేక గిన్నెలన్నీ తీసి టబ్ లో వేసి బాల్కనీలో పెట్టి, సింకూ, గట్టూ తుడిచి శుభ్రం చేసింది. తన రూములోకి వచ్చి పక్కసరి చేసుకుని స్నానానికి వెళ్ళింది. శ్వేత చిరాగ్గా అక్కడే హాల్లోనే చిన్న దీవాన్ మీద కూర్చుండిపోయింది. పక్కనే ఆఫీస్ బాగ్, లంచ్ బాగ్ పడేసింది.

కాలు చాపుకుని "వసూ, ఏదైనా తినడానికి ఇవ్వవే! ఆకలి" అంటూ అరిచింది..

" నువ్వు కూర్చున్న దగ్గరనుంచీ సరిగ్గా పది అడుగులు వేస్తే నువ్వు ఎప్పుడో కాని చూడని వంటగది అనే ప్రదేశం ఉంది. అక్కడ ఉన్న డబ్బాల్లో ఏదో ఒకటి తినడానికి ఉంటుంది డబ్బాల్లో" అంది వసంత నవ్వుతూ తన గదిలోంచి.

" చంపేస్తాను దెయ్యం" అంటూ విసుక్కుంది శ్వేత.

" నీతో పాటే నేనూ వచ్చాను కదా, నీకు లేని ఓపిక నాకెలా వస్తుంది చెప్పు? టీకి నీళ్ళు పెట్టు. తినడానికి ఏమున్నాయో చూడు. వస్తున్నాను" అంది అక్కడనించే.

ఏమనుకుందో లేచి శ్వేత వెళ్ళి టీకి నీళ్ళు పెట్టింది. డబ్బాలు చూసి ఉన్న స్నాక్స్ రెండు ప్లేట్లలో సర్దింది. మరో పది నిమిషాలకి ఇద్దరూ టీ తాగారు.

“తులసి కే మేయిందే ఈ మధ్యన ఇలా విసిగిస్తోంది?” కోపంగా అంది శ్వేత. ఆమె అలా అంటూ ఉండగానే తలుపు తీసుకుని వచ్చింది తులసి. ఆమెని చూస్తూనే విరుచుకుపడింది తులసి మీద.

"ఇలా చేస్తే జీతం కట్ చేస్తా. ఏమనుకున్నావో?" అని బెదిరించింది.

"పోనీలే అక్కా, అలాగే " అంది తులసి. దాంతో శ్వేతకింకా కోపం వచ్చింది.

" నీకు డబ్బు అంటే లెక్కలేదు, మాట అంటే అసలే లెక్కలేదు" అని చిర్రుబుర్రులాడింది శ్వేత.

" చెప్పాను కదక్కా, నాన్నకి బాగోలేదు, అందుకనే అర్జెంట్ గా వెళ్ళాను. సీరియస్ అయ్యేసరికి ఫోన్ చెయ్యలేకపోయానక్కా, అంతే కానీ పని మానెయ్యడం నాకు సరదా కాదు కదక్కా, నువ్వలా మాట్లాడితే నేనేం చెప్పలేనక్కా. అందుకే నీ ఇష్టం అన్నాను" అంది తులసి.

ఏం మాట్లాడాలో తెలియనట్టు ఉండిపోయింది శ్వేత.

గబ గబా వంట మొదలు పెట్టింది తులసి. "అక్క వచ్చిందక్కా ఊరునించి, రేపటినించీ నాకు ఇంత పని ఉండదు. నాన్నకి తగ్గి మళ్ళీ లేచి తిరిగితే చాలు. కొన్నాళ్ళు ఊరికి తీసుకుపోతా అంటోంది" అంది పిండి కలుపుతూ.

"ఒక్కదానివీ ఉండగలవా మరి?" అంది శ్వేత అంతలోనే.

" పక్కవాళ్ళుంటారుగా అక్కా, పరవాలేదులే! రెండు మూడు నెల్లుంచుకుని పంపిస్తా అంది. ఇక్కడ గాలికి ఆయాసం, దగ్గూ ఎక్కువవుతోంది నాన్నకి అన్నారు డాక్టర్లు." అంది నిట్టూరుస్తూ. "నేను పెళ్ళి చేసుకుని వెళ్ళిపోతే నాన్న ఒక్కడే అయిపోతాడు అని నేననుకుంటాను. తనకేదైనా జరిగితే నేనొంటరిదాన్నవుతానని నాన్న బాధ. ఒకల్లమే వస్తాము, ఒకల్లమే పోతాము, మధ్యలోనే ఈ తోడుండడాలు" అంది వేదాంత ధోరణిలో. తెలియకుండానే ఆ పిల్ల కళ్ళల్లోంచి చెక్కిళ్ళమీదకి కారుతున్న నీళ్ళు. తులసికి రెండడుగుల దూరంలో నించుని ఆమెనే చూస్తోంది శ్వేత. పదో క్లాస్ ఫెయిల్ అయిందిట పంతొమ్మిదేళ్ళ తులసి. తండ్రిని చూసుకుంటూ పనిచేసి ఇల్లుగడుపుతుంది. అలా ఆపిల్లని చూస్తుంటే ఏదో కొత్త కోణం కనిపిస్తున్నట్టుగా అనిపించింది శ్వేతకి.

" కావాలంటే మాతో ఉండు ఆ రెండు మూడు నెలలూ" అంది వసంత.

" అవును, గుడ్ ఐడియా" అంది శ్వేత కూడా.

" మా ఊరు వదిలి నాన్న వైద్యం కోసమే ఇక్కడకి వచ్చాము అక్కా.వైద్యానికీ, ఇంటి ఖర్చులికీ మా ఊరికంటే డబల్ అవుతోంది ఇప్పటికే. ఇప్పుడేమో ఇక్కడే ఆయాసం ఎక్కువ అవుతోంది" అంది దిగులుగా.

"తగ్గుతుందిలే. కంగారు పడకు" అన్నారు స్నేహితురాళ్ళిద్దరూ. గబ గబా వంట ముగించి.. " రేప్పొద్దున్నే కొంచం లేట్ అవుతుందక్కా, అక్కని, నాన్ననీ పంపించి వస్తాను, ముందే చెప్పేస్తున్నా కదా, జీతం కట్ చెయ్యవు కదా" అంది చిన్నగా నవ్వుతూ.

శ్వేత కూడా నవ్వింది.

వండినవన్నీ టైబిల్ మీద పెట్టేసి,ప్లేటులూ, గ్లాస్ లూ సర్దేసి చున్నీ తో చేతులు తుడుచుకుంటూ "వస్తానక్కా" అంటూ బయలుదేరింది తులసి.

" తులసీ ఒక్క నిమిషం" అంటూ శ్వేత లోపలకి వెళ్ళి రెండువేలు తెచ్చి ఆమె చేతిలో పెట్టింది.

"అక్క కివ్వు, అవసరం ఉంటుందేమో " అంది చిరునవ్వుతో. ఆశ్చర్యంగా చూసింది తులసి.

" వద్దక్కా, ఉన్నాయిలే" అంటూ ఏదో చెప్పబోయిన తులసిని మధ్యలోనే ఆపి.

" పరవాలేదు, ఉంచు" అంది శ్వేత. వసంత కూడా రెండు సార్లు చెప్పడంతో తీసుకుంది. పరుగులాంటి నడకతో బయలుదేరింది తులసి.

"ఏమయింది శ్వేతా, ఆర్ యూ ఓ కే?" అంది వసంత నవ్వుతూ తులసి వెళ్ళిన ఐదు నిమిషాలకి.

" నువ్వేమీ నవ్వక్కరలెదు. నేను శుభ్రంగా ఉన్నాను" అంది శ్వేత ఉక్రోషంగా..

"అయితే మంచిదే, దా భోంచేద్దాం" అంది వసంత నవ్వుతూ.

ఎప్పటిలా ఎవరినో ఒకరిని తిట్టకుండా, అసలేమీ మాట్లాడకుండా భోంచేస్తున్న స్నేహితురాలిని చూస్తూ.

" ఏమయింది శ్వేతూ!" అంది.

" రోల్ రివర్సల్" అంది ఏదో ఆలోచిస్తున్నట్టుగా..

"అంటే," అంది వసంత

" ఏమీ లేదులేవే, టేబిల్ కి రెండు వైపులా కూర్చుని చూస్తే తప్ప ఏ విషయమైన రెండువైపులనించీ తెలియదు కదా!" అంది నవ్వుతూ..

" మీటింగ్ రూములో శ్రీకర్ తో మాట్లాడినప్పుడు కూడా అవలేదే ఈ జ్ఞానోదయం" అంది వసంత.

" నవ్వకు వసూ, ఐయాం సీరియస్. పొద్దున్న శ్రీకర్ స్థానంలో ఉన్నాను మొదట తులసిమీద అరిచినప్పుడు, ఆతర్వాత మెల్లగా నాకు తెలియకుండానే పొద్దున్న నేనున్న స్థానంలోకి, ప్రస్తుతం తులసి ఉన్నవైపు వచ్చి చూశాను, అర్ధం అయింది. ఆ పిల్ల పాపం హక్కుగా సెలవు పెట్టలేదు, తన బాధ్యత కోసం గా సెలవు పెట్టలేదు. తప్పనిసరి అయి పెట్టింది.. ఐ నో.. లీవ్ ఈజ్ నాట్ ఏ ప్రివిలేజ్.." అంది నెమ్మదిగా..

Click here to share your comments on this story